

రంగయ్య తమ్ముడు

ప్రొద్దుపోయి రెండు గడియలైంది. చీకటిపడుతూ వుంది. ఆకాశాన తెల్లగా దూదిపింజల్లాంటి మబ్బులు నడయాడుతున్నాయి. ఇప్పుడప్పుడే వానపడే సూచనలు లేవు.

మట్టిబాట మరమ్మత్తుకోసం, బాట కిరువైపులా త్రవ్విన గుంతల్లో నుంచీ బావురు కప్పలు సాగిస్తున్న పాటకచ్చేరీ వింటూ చింతచెట్టు మొదట కూర్చున్నాను.

వీధులంతా చిత్తడి చిత్తడిగా తయారై అనవసరంగా బయట పాదం మోపడానికి బుద్ధిపుట్టక ఎక్కడివారక్కడే ఒదుగుళ్ళు పోతుండడంవల్ల వూరంతా నిశ్శబ్దంగా వుంది. లేదంటే గాటిలో కసువు కనిపించక సగం తెంచుకున్న లేగదూడను వెంబడిస్తూ కుర్రాళ్ళు వేస్తున్న కేకలుమాత్రం వుండి వుండీ వినిపిస్తున్నాయి.

'ఇంకా నిద్ర లేవలేదా పంతులూ! ముసారా పట్టినట్టుంది. మబ్బులో ప్రొద్దు తెలియడంలేదు. గంట ఏడుకు తక్కువ వుండదు. లెగవయ్యా లెగు' అన్న వెంకురెడ్డి మేలుకొలుపుతో నాకా రోజు తెల్లవారింది. సన్నగా వాన చినుకులు జారుతున్నాయి. ముసారాపట్టినట్టున్న మాట నిజమే! కానీ తెల్లవారిపూట వచ్చిన వానగానీ, బంధువుగానీ ఎంతోసేపు మకాం పెట్టడం జరగదన్న లోకోక్తి ఒకటి వుంది. ఐతే ఈ లోకానుభవానికి విరుద్ధంగా మధ్యాహ్నం మూడుగంటలదాకా వాన తేపలు తేపలుగా వస్తూనే వుంది. సూర్యాస్తమయానికి కాస్తా తెరపి ఇచ్చి వెలిసినట్టే తోచినా అర్ధరాత్రిలోగానే మళ్ళీ వర్షం ప్రారంభం కావచ్చు. అదిగో, మల్లేశ్వరుడి గుట్టమీద అప్పుడే ఒక నల్లటి మేఘం నడయాడుతోంది.

బాటలో ఎవరో వస్తున్న కలకలం వినిపించి, కాస్త ముందరికి జరిగి కూర్చున్నాను.

మసక చీకటిని చీల్చుకుని గంభీరంగా అడుగులు వేసుకుంటూ వస్తున్న ఓ నడితరం మనిషి నాకు ముమ్ముందుగా కనిపించాడు. అతడితల సిద్ధవటం దోసకాయంత పెద్దది. అతడు తలకు చుట్టుకున్న పాగా అంత కన్నా పెద్దది. భుజానికిరువైపులా పెద్ద జోలె వ్రేలాడుతోంది. మెడలో రుద్రాక్షమాలికలు వ్రేలాడుతున్నాయి. కాళ్ళకు నాటురకం చెప్పులున్నాయి. అన్నింటికన్నా ఆ ఆకారంలో కొట్టవచ్చినట్టు కనిపించేవి అతడ గడ్డమూ, మీసాలు!

ఎరుపు రంగు చీర చెరగు గాలికి రెపరెపలాడుతుండగా, ముక్కు పైని ముక్కెర చీకట్లో మెరసిపోతుండగా, కాలివ్రేళ్ళ వెండి మెట్టెలు ఒకదానికొకటి తగిలి సన్నసన్నగా మ్రోగుతుండగా, ఓవైపున భర్త మోస్తున్న జోలెకంటే మరీ పెద్దదైన జోలెను, మరోవైపున చంటిబిడ్డను మోసుకుని అతడి అడుగుల్లో అడుగులు వేసుకుంటూ భార్య అతణ్ణి వెంబడిస్తోంది.

ఆమెను చూస్తుంటే భర్తకు భార్యను సహచారిణి అనీ, సహధర్మిణి అనీ అనడం యిందుకే కాబోలనిపించింది.

ఆ భార్యాభర్తల వెంట పావడాపైన దావిణి వేసుకున్న ఓ బక్కపలచటి అమ్మాయి నాలుగేళ్ళ పసివాణ్ణి చేయి పట్టుకుని నడిపించుకుంటూ వస్తోంది.

చెట్టుకింద నేను కనిపించగానే అతడు బాటలో ఆగి "ఈ పూళ్ళో తల చాటు దొరుకుతుందా బాబూ?" అన్నాడు.

పైకప్పుమాత్రం పూర్తిగోడలు సగానికి మాత్రమే లేచివున్న పూరి కొట్టాన్ని చూపించి అక్కడికి వెళ్ళమన్నాను.

"అది పలుకూటమా బాబూ?" అతడు ప్రశ్నించాడు.

"పలుకూటమే! ఐనా ఫరవాలేదు. పగటివేళ మాత్రం పిల్లలు చదువుకుంటారు. అప్పుడు మీరు మీ గంతల్నీ బొంతల్నీ ఏ చెట్టుక్రిందికో,

ఏ పందిరి కిందికో చేర వేయవచ్చు. చీకటి పడగానే మళ్ళీ బడిలోనే విడిది చేయవచ్చు'' అన్నాను.

"అలాగే బాబయ్యా అలాగే" అంటూ అతడు ముందుకు కదిలాడు. విష్ణుదేవుడి వెంట లచ్చి, ఆమె వెనుక అవరోధవ్రాతం, వారి వెన్క పక్షీంద్రుడూ తరలినట్టుగా అతడివెనుక భార్య, భార్యవెనుక కూతురు, కూతురు వెంట కొడుకు వరుసగా కదిలారు.

మాటల ధోరణిబట్టి చూస్తే అతడు బాగా వానలు వెలిసే దాకా మా వూళ్ళోనే మకాం పెట్టబోతున్నట్టు తోచింది. అవును పాపం! ఈ వానల్లో వంకల్లో, పెళ్ళాం బిడ్డలను వెంటబెట్టుకుని వూళ్ళు తిరగడం యెలా సాధ్యమౌతుంది? ప్రతిసంవత్సరమూ వర్షాకాలం రాగానే యిలాటి కుటుంబాలు ఒకటీ రెండు మా వూళ్ళో దిగడం మామూలే. కానీ అప్పటిలాగా యికమీదట యిలాటివాళ్లు తలదాచుకోసం వారి పంచ, వీరి పంచ చూసుకోవలసిన అవసరంలేదు. క్రొత్తగా శాంక్షనయిన స్కూలు పుణ్యమా అని మా ఊళ్ళో ఈ పూరి కొట్టమొకటి తయారవుతోంది. పట్టణంలో రైలు దిగగానే సరాసరి లాడ్జింగు సౌకర్యాలున్న హోటలుకు దారితీసినట్టుగా వీళ్ళు ఈ కొట్టంలో తమ కాలాన్ని గడుపుకుపోవచ్చు.

మల్లేశ్వరుడి గుట్టపైన ముసలుతున్న నల్లటి మేఘం క్షణక్షణానికీ దిక్కులకు విస్తరిల్లిపోతోంది. దిగ్విజయాన్ని సాధించనిదే వూరుకోనన్న జిగీషను ధ్వనిస్తూ అదొకసారి వురమనుగూడా వురిమింది. ఇప్పుడిప్పుడే వానరాదని అనుకున్నప్పుడు వానరాకడ, ప్రాణంపోకడ ఎవరు చెప్పగలరన్న పెద్దలమాటను నేను మరచిపోయాను.

లేచి మెల్లగా యింటిదారి పట్టాను. త్రోవప్రక్కన కొట్టంలో వెలుగుతున్న దీపం కనిపించింది. గోడపైన్నుంచి లోపలికి చూశాను. పెద్దా చిన్నా - ఆడా మగా వ్యత్యాసం లేకుండా వూదు వూరంతా అక్కడే వుంది. చూరుక్రింద రాళ్ళుపేర్చి ఆ తల్లీకూతుళ్ళు అప్పుడే వంట ప్రయత్నంలో వున్నారు. ఒడిలో కూచున్న చంటివాడు గడ్డాన్ని పరామర్శిస్తుండగా, తండ్రి పద్మాసనం వేసుకుని నిశ్చలంగా కూర్చున్నాడు. తీరామారా సమా

ధానమివ్వడానికైనా ఎడము లేకుండా అక్కడ చేరిన వాళ్ళందరూ ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు.

"మీదేవూరు?"

"మీవాళ్ళందరూ యిలాగే దేశాలు తిరుగుతారేమిటి?"

"మీరందరూ ఒకచోట కలిసేదెప్పుడు?"

బంధువులు ఎవరింటికొస్తే వాళ్ళకు మాత్రమే సంభ్రమం కలుగుతుంది. కాని వీళ్ళ రాకవల్ల ఏ కొందరికి మాత్రమోగాక, అందరికీ సంబరం కలిగినట్టుంది. ఐతే వీళ్ళు వూరికంతా బంధువులన్నమాట!

* * *

మరునాటి వుదయం పొలంవైపు వెళ్ళి కాస్త పొద్దెక్కిన తర్వాత యింటికి తిరిగివచ్చాను. వికసించిన వేయిరేకుల పువ్వులాంటి ముఖంతో మా ఆవిడ నాకెదురుగా వచ్చేసింది.

సంగతేమిటని నే నడగవలసిన అగత్యం గూడా లేకపోయింది. నును పిగ్గు దొంతరల్ని అటూ యిటూ తొలగదోసుకుంటూ ఆవిడే "నేను చేయి చూపించుకున్నానండీ" అంది.

"నీకూ పట్టిందన్నమాట పిచ్చి! పోనీ, చేయి చూపించుకోగా తేలిందేమిటి?" అన్నాను.

"మరి....మన కేమో....ఇంక రెండు మాసాల్లో...." అంటూ ఆవిడ మాటిమాటికీ నా కళ్ళలోకి చూడసాగింది.

"చెప్పు మరి. ఇంక రెండు మాసాల్లో మనకు శుక్రమహర్దశ ప్రారంభం కాబోతున్నదన్నదట! అంతేగదూ?" అంటూ నేనా వాక్యాన్ని పూర్తిచేశాను.

"అంతేకాదండీ! మరీ, మీకు కోపం ముక్కుమీదనే వుంటుందట! మాట పెళుసైనా మనసు మాత్రం నవనీతమేనట! ఇంకా యేమిటేమిటో చెప్పాడు...."

ఓరి వీడిల్లు బంగారంగానూ! మా ఆవిడ చేతిలోనే నా స్వభావాన్ని గూడా పసిగట్టగలిగిన వీడి మేధాశక్తి మెచ్చుకోదగ్గదే ననుకుంటూ "ఇంతకూ ఆ జ్యోతిష్య శిఖామణి ఎవరో చెప్పావుకావు" అన్నాను.

"ఇంకెవరండీ! రాత్రి మనవూళ్ళో కొచ్చిన బైరాగే! ఎంత బాగా చెబుతాడనుకున్నారు! యథాదృష్టిగా కళ్ళతో చూచినట్లే చెబుతుంటే! ఎక్కడి వాళ్ళక్కడ నోళ్ళు తెరిచేశారనుకోండి. అన్నట్టు మరొక విశేషమండోయ్! ఆ బైరాగి భార్య గద్దెగూడా చెబుతుందట! సాయంత్రం రమ్మన్నాను."

నే నొకసారి నిట్టూర్చి "హస్తసాముద్రికాలు, గద్దెలూ తెలిసిన వాళ్ళకు మంత్ర తంత్రాలు తెలియకుండా వుంటాయా జానకీ? ఎలాగూ నువ్వు నిద్రలో ఉలికిపడి కలవరిస్తుంటావు. ఎందుకైనా మంచిది, ఓ తాయెత్తు కట్టించుకో" అన్నాను.

"మీకంతా ఎగతాళండీ మరీనూ........" అంటూ తెచ్చిపెట్టుకున్న వుక్రోషంతో మా ఆవిడ రివ్వున లోపలికి వెళ్ళిపోయింది.

ఆమె అటు లోపలికి వెళ్ళిందో లేదో, వీధివైపునుంచి వెంకురెడ్డి ప్రవేశించాడు.

"అబ్బబ్బ, ఒక్కొక్క మాటే ఒక్క వరా చేయదటయ్యా పంతులూ! ఒక చిత్తేనా, ఒక సత్తేనా, ఒక ఎరుకేనా, వేదాంత సారమంతా ఆ బైరాగి నాలుక చివర్నే వుంది గదయ్యా! ఆహాహా, మూలం తెలిసిన వాడిలా వున్నాడయ్యా మహానుభావుడు!"

నా కప్పుడనిపించింది—చిన్నపిల్లలకు ఓ ఆటబొమ్మ కనిపిస్తే వాళ్ళు దానిపట్ల ఎంతో ఆసక్తిని వ్యక్తం చేస్తారు. అది వాళ్ళకొక అపూర్వ శిల్పంలా సాక్షాత్కరిస్తుంది. వాళ్లు దానికో గుడ్డపీలిక కట్టబెట్టి జడవేసి, పూలు బెట్టి సింగారిస్తారు. పెళ్ళికూతుర్ని చేస్తారు. ఇంతజేసీ నాలుగైదురోజులు గడచి అది కాస్తా పాతబడగానే ఓమూల విసరి పారేస్తారు. ఎంతగా పెరిగి పెద్దవాళ్ళయినా ఆ పెద్దవాళ్ళల్లోనూ ఈ పసిపిల్లల చిత్తప్రవృత్తి లేకపోలేదు. అందులోనూ నాగరికతకు దూరంగా పల్లెల్లో బ్రతికేవాళ్ళల్లో ఈ పసిపిల్లల మనస్తత్వం మోతాదు మీరినట్లు తోస్తుంది. మరీ, బ్రతుకుతెరువుకు ఏవో మరికొన్ని చిట్కాలు నేర్చిన యిలాటి బైరాగి ఒకడు వీళ్ళకు తటస్థిస్తే యిక చూడాలి తమాషా! వాణ్ణి గురించి లేనిపోని ఊహాపోహలెన్నో అల్లుకుంటాయి. అతడు మట్టిపెళ్ళను బంగారంగా మార్చేయగలడంటారు.

పరిగెడుతున్న పామును మంత్ర ముగ్ధంచేసి నిలబెట్టగలడంటారు. ఐతే ఈ గొడవగూడా తాత్కాలికం మాత్రమే! క్రమంగా కొద్ది రోజుల్లో ఈ కుతూహలం తగ్గిపోతుంది. ఆ క్రొత్తమనిషి ప్రాధాన్యం చప్పబడి చల్లారి పోతుంది.

కానీ ఆశ్చర్యమేమిటంటే నా అంచనాకు విరుద్ధంగా పది రోజుల్లో ఈ బైరాగి ప్రాధాన్యం యింతై అంతై వామనుడి విశ్వరూపంలా విజృంభించింది—అందుకు కారణం ఓ చిత్రమైన సంఘటన.

నచ్చినవాళ్ళకు పెట్టిపోయడంలోనూ, నచ్చనివాళ్ళని ముప్పుతిప్పలు పెట్టి మూడుచెరువుల నీళ్ల త్రాగించడంలోనూ పేరెన్నికగన్న కుటుంబాలు మా వూళ్ళో నాలుగైదున్నాయి. వాటిలో రంగయ్యగారి కుటుంబం ఒకటి. రంగయ్యగారికి పది పదిహేనెకరాల దివ్యమైన మాగాణితోబాటు అంగబలమూ, అర్థబలమూ గూడా పుష్కలంగా వుంది. ఆయనకు ముచ్చటగా ముగ్గురు కొడుకులు. ముగ్గురూ తండ్రి సైగ అంటే భళానోయి భాయి తమ్ముడా అంటూ బాణాకర్రలు చేతబట్టి రంగంలో దూకడానికి సంసిద్ధులు. రంగయ్యగారు కొడుకుల కందరికీ పెళ్ళిళ్లు చేసేశాడు. కోడళ్లు గూడా కాపురాని కొచ్చేశారు.

ఐతే ఈ కొడుకులకూ కోడళ్ళకూ ఈ కథతో అట్టే ప్రసక్తి లేదు. ఆ రంగయ్యగారూ, ఆయన భార్య, ఈ కొడుకులూ, కోడళ్ళూ ఎవరి సంగతైతే పట్టించుకోరో ఆ ముసలావిడ సంగతే యిప్పుడు మనకు కావలసింది!

ఆ ముసలావిడ గూడా ఎవరోగాదు - సాక్షాత్తు రంగయ్యగారి తల్లి! పేరు మంగమ్మ. వయసు డెబ్బయికి తక్కువుండదు. బొత్తిగా సత్యకాలపు మనిషి. కల్లా కపటాలకూ ఆమెకూ ఉత్తర దక్షిణ ధ్రువాలకున్నంత దూరం!

ఈ మంగమ్మకేం బుద్ధి పుట్టిందోగానీ ఓ రోజు వుదయం మునిమనుమరాల్ని దగ్గరికి పిలిచి "ఒసే సీతీ! వెళ్ళి నేను రమ్మంటున్నానని ఆ బైరాగిని కేకేసుకురా" అంది.

"మూడుకాళ్ళ ముసలాళ్ళకు గూడా జోస్యాలు కావలిసొస్తాయి" అని రుసరుసలాడుతూ ఆ పిల్ల వెళ్ళి బైరాగిని పిలుచుకొచ్చింది.

మంగమ్మకు దగ్గరగా కూర్చుని ఆ బైరాగి "నువ్వు చల్లగా నూరేళ్లు బ్రతకాలి తల్లీ!" అంటూ ఆమె చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు.

"ఎందుకూ నూరేళ్ళు బ్రతకడం! పడుసోళ్ళ కాళ్ళదగ్గర చెత్తలా పడివుండడానికా బాబూ! వద్దొద్దు. నా ఆకెప్పుడో బయటపడుతుందో చూడు" అంది మంగమ్మ.

బైరాగి మంగమ్మ చేతినొక్కసారి చూచి తలపైకెత్తి "నీకు రామ లక్ష్మణుల్లా యిద్దరు కొడుకులు తల్లీ!" అన్నాడు.

కళ్ళు పెద్దవై పోతుండగా అక్కడ గుమిగూడిన వాళ్ళందరూ 'చూశావా, చూశావా' అన్నట్లు చూపులతోనే ప్రశ్నించుకున్నారు.

బైరాగి మళ్ళీ ప్రారంభించాడు—

"అందులో పెద్దకొడుకు మాంధాతలా బ్రతుకుతున్నాడు. చిన్న కొడుకు మాత్రం నీకు గాకుండా పోయాడు...."

ఝంఝామారుతంలా అడ్డు తగిలింది మంగమ్మ—

"అదే నాయనా, అదే బాబూ! నా మనసులోని విషయం చెప్పే శావురా బైరాగీ! వాడేమయ్యాడో చెప్పు. ఎక్కడున్నాడో చెప్పు."

"ఈ అయిదారు రోజులనుంచీ యితడీ వూళ్ళో వాళ్ళ సంగతులు వాకబుచేసి తెలుసుకున్నాడేమో!—" గుంపులోనుంచీ ఎవరోగానీ బయటికి వినిపించీ వినిపించకుండా ఈ సందేహాన్ని ప్రకటించారు.

బైరాగి వులికిపడి, ఈసారి మరీ బిగ్గరగా "ఆ పారిపోయినతడికి ఓ పుట్టుమచ్చ వుంది" అన్నాడు.

"మచ్చ లేకేం నాయనా! ఉండేదిరా బాబూ! చెప్పు చెప్పు" అంటూ మంగమ్మ బైరాగి దగ్గరగా జరిగి కూర్చుంది.

"మనిషన్న తర్వాత మచ్చలుండకపోతాయా!" గుంపులోనుంచీ మళ్ళీ ఒక సందేహం రామబాణంలా వచ్చింది.

రోషంతో వుక్కిరిబిక్కిరై పోయాడేమో, బైరాగి కళ్ళలో కెం జీర ప్రాకింది. అతడు తటాలున కప్పుకున్న పాత శాలువను అవతలకి తోసి "చూడండి బాగా చూడండి. సరిగ్గా యిలాటి మచ్చ! ఇలాగే రొమ్ము పైన అణాకాసంత పుట్టుమచ్చ" అంటూ తన రొమ్ముపైని మచ్చను జనసమూహానికి ఆవిష్కరం చేశాడు.

ఈ హఠాత్సంఘటన ముసలావిడపైన ఎలా పనిచేసిందో మనకు తెలియదు. సంవత్సరాల తరబడీ ఆమె ఎదలో నిలుపుకున్న శోక స్రవంతులు కట్టలు తెంచుకున్నాయేమో! ఆ దుఃఖాతిరేకంలో మనసు కాస్త చెదిరిం దేమో! ఆమె బైరాగిని పొదివి పట్టుకుని "నా బాబే! నా తండ్రే! నీకోసం చూచి చూచీ నా కళ్లు కాయలు గాశాయిరా బాబూ! ఇంతకాలానికి నాక్కని పిస్తూన్నావట్రా నాయనా!" అంటూ ఏడుపు మొదలెట్టింది.

మంగమ్మ చిన్నకొడుకు కేశవులు యింటినుంచీ వెళ్ళిపోయిన కథ ఈనాటిదిగాదు - అది ముప్ఫయియేళ్ళ క్రిందటి సంగతి. అప్పటికి కేశవు లకు పదహారేళ్ళని చెప్పుకోగా వినడమేగానీ అతణ్ణి గురించి నా యీడు వారి కేమీ తెలియదు, ఈ ముప్ఫైయి యేళ్ళలో ప్రపంచంలో లెక్కలేనన్ని పరి ణామాలు సంఘటించాయి. ద్వితీయ ప్రపంచ మహాసంగ్రామం జరిగింది. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించింది. ఆంధ్రులకు రాష్ట్రం లభ్యమైంది. ఐతేనేం! ఇవన్నీ మంగమ్మకు తెలియవు. దేశాలపాలైన చిన్నకొడుకు తనకి కనిపించడేమో నన్నదే ఆమె ఆవేదన.

ఇంతకాలంగా ఆమె మానసాకాశంలో మేఘంలా వ్యాపించి వుండిన ఆ ఆవేదన వున్నట్టుండి కన్నీటి జడివానగా మారిపోయింది.

అందుకు తగ్గట్టుగా మంగమ్మ పిన్నమ్మ కూతురు శేషమ్మ మరొక వైపునుంచీ బైరాగిమీద వ్రాలిపోయి "ఎంతగా గడ్డాలు మీసాలు పెంచు కుంటేనేంరా కేశవులూ! కన్నతల్లికి గుర్తు తెలియకుండా పోతుందా?" అంటూ రాగాలు ప్రారంభించేసింది.

ఇంకేముంది! ఈ వార్త క్షణాల్లో యింటింటికీ ప్రాకింది. విన్నవారు విన్నట్లేవచ్చి అక్కడ మూగిపోయారు.

మిషను బావిదగ్గర అడుసు దున్నిస్తున్న రంగయ్యగారి కెవరు చెప్పారోగానీ, ఆయన సుడిగాలిలా వచ్చేశాడు.

ఆ పాటికి బైరాగి పెళ్ళాం బిడ్డలు గూడా అక్కడ హాజరయ్యారు.

"ఏమిటీ గొడవ! ఊరుకోం డూరుకోండి" అంటూ ముందుకు వచ్చిన రంగయ్యగారు బైరాగి వైపు తిరిగి, "ఇదేం అల్లాటప్పా వ్యవహారం గాదు! నిజం చెప్పు. నువ్వు మా కేశవులివేనా?" అని గర్జించాడు.

"ఇదేం ఎవ్వారమయ్యో! బావుందిలే జావుంది. ఇక్కడ మీ కేశవులెవరయ్యో. మేం బైరాగులమైతేనూ" అంటూ బైరాగి పెళ్ళాం రంగయ్యగారికి అడ్డు తగిలింది.

ఏదో చెప్పదలచినట్టు బైరాగి పెదవి కదపబోయాడు.

"చాల్చాల్లేవయ్యో! మాటాడీ మాటాడీ కథ నిందాకా తెచ్చుకున్నది చాలుగానీ, నువ్వు లేచి నడు" అంటూ ఆవిడ మొగుడి రెక్కపట్టుకుని బరబరా లాక్కెళ్ళిపోయింది.

"ఈ పెళ్ళాం రాకాసిలా అడ్డుపడకపోయివుంటే బైరాగి తను కేశవుల్నేనని నిజం ఒప్పుకుని వుండేవాడు. కానీ దాని భయం దానిది. వీడెక్కడ తననూ, తన బిడ్డల్నీ విడనాడి అయినవాళ్ళలో కలిసి పోతాడోనని దాని బెంగ! అయ్యో పాపం! ఈ కేశవులు పెళ్ళాం బిడ్డల మధ్య అడకత్తెరలో పోకలా నలిగిపోతున్నాడు."

—అంటూ ప్రేక్షకులు చెమరించిన కళ్ళను పై గుడ్డతో తుడుచుకున్నారు.

"నీకేంగతి పట్టిందిరా కేశవులూ! వెళ్ళివెళ్ళి బైరాగి కూటిలో పడ్డావట్రా నాయనా!" అంటూ మంగమ్మ అదే పనిగా వాపోసాగింది. ఈ వింతను చూచి పోవడానికి పరిసర గ్రామాలనుంచి గూడా జనాలు తండోపతండాలుగా రాసాగారు!

నాలుగైదు రోజులిలా గడచిపోయాయి. ఆదిలో బైరాగి "నేను కేశవుల్ని కానయ్యా బాబో" అని నెత్తిన నోరుపెట్టుకుని మొత్తుకున్నాడు. కానీ అతడిగోడు వినిపించుకునే నాథుడు లేకపోయాడు.

ఇక యిలా లాభం లేదనుకొన్నాడేమో బైరాగి 'అవును-కాదు' అని చెప్పడం మానేసి మహాయోగిలా మౌన ముద్ర ధరించేశాడు.

నిజానికి వీళ్ళేమనుకున్నా అతనికి పోయేదేమీలేదు. పైగా వీళ్ళిలా అనుకోవడం తనకు లాభదాయకంగానే వుంది. బియ్యంగా, పప్పుదినుసులుగా, కాయకూరలుగా వివిధ సంబారాలు మంగమ్మ దగ్గరనుంచీ, యింకా ఆమెపైన అభిమానంవున్న బంధువర్గం దగ్గరనుంచీ ఏకంగా వచ్చి పడుతున్నాయి. పెట్టిన దినములలో నానార్థములు నట్టడవులకు నడచి రావడమంటే యిదే మరి! వీళ్ళు పెట్టినన్ని రోజులు పెట్టనీ! హాయిగా తిని త్రేన్చడానికి తనకేం యిబ్బందిలేదు.

ఐతే అతణ్ణి అలా ఎంతకాలమైనా తింటూ కూర్చోనిచ్చేదికాదు మా వూరి జనం! 'ఏమిట్రా యిది! కడకీ వ్యవహారంలో ఐసా పైసా తేలక పోయెనే!' అని వాళ్ళు పాపం, ఎంతగానో విచారించారు,

ఇంతలో ఒక బుద్ధిమంతుడు - అందరూ ప్రయత్నించేసి చివరకు యిది మండదన్న నిర్ధారణకువచ్చి దూరంగా పారవేసిన ఈ అగ్గిపుల్లను యిట్టే వెలిగించేశాడు.

అతడు బైరాగితో ఏదో లోకాభిరామాయణం ముచ్చటిస్తూ వుండి మధ్యలో కేవలం మాటవరుస కడిగినట్టుగా "ఐతే, నువ్వు మా వూళ్ళో యింకా పదిరోజుల పాటుంటావా బైరాగీ?" అని ప్రశ్నించాడు.

"పదిరోజులేమిటి బాబూ! ఊళ్ళు తిరిగీతిరిగి నా తల బట్టకట్టిపోయింది. పైగా ఈ ఊళ్ళో ఆదరణగూడా చాలా బాగుంది. అంచేత ఈ జీవుడికి యిక్కడే వుండి పోదామని వుంది" అన్నాడు బైరాగి.

ఈ వార్త రంగయ్యగారి గుండెల్లో పిచ్చల పిడుగులా పడింది. ఆయన "మొదటికే మోసం వచ్చేటట్టుందిరా గోపాలం! ఇక చూస్తూ వూరుకుంటే జరగదురా రామ్మూర్తి! ఈ పీడ నెలాగైనా వదిలించుకోవాలిరా వీరేశం!" అంటూ ముగ్గురు కొడుకులతోనూ మంత్రాంగం సాగించాడు.

నలుగురూ కూడబలుక్కుని నమ్మినబంటు నాగుమయ్యను రాయబార నిమిత్తం బైరాగి దగ్గరకు పంపారు.

"నీమీద రంగయ్యగారికి దయ కలిగింది. ఆయన నీకీ వందరూపా యలిస్తున్నారు. దీన్ని స్వీకరించి నువ్వు వీలైనంత త్వరగా ఈ ఊళ్ళో నుంచి వుడాయించేయాలి"-ఇదీ నాగుమయ్య రాయబారంలోని సారాంశం.

ఎలా తెలిసిందోగానీ ఈ సంగతి కాస్తా అవతలి వాళ్ళకు తెలిసి పోయింది.

ఈ అవతలి వాళ్ళకు ఏకైక నాయకుడు రంగనాథం.

రంగయ్యగారికి గ్రామ నాయకత్వంలో ప్రతిస్పర్థి, పంచాయతీబోర్డు ప్రెసిడెంటు ఎన్నికల్లో ప్రత్యర్థి, అవసరమైతే దొమ్మీకి గూడా తలపడగల ప్రతిద్వంది అయిన రంగనాథం నెరసిన బొద్దు మీసాల కొసల్ని మెలివేస్తూ బైరాగిని సముఖానికి రప్పించాడు.

"దండాలు బాబూ, దండాలు! తమరెందుకో ఈ బైరాగోణ్ణి రమ్మ న్నారటండి!" అని చేతి వ్రేళ్ళు నలుముకుంటూ బైరాగి రంగనాథం ఎదుట నిల్చున్నాడు.

"ఒరేయ్ కేశవులూ! నువ్వు వాళ్ళ దగ్గర వీళ్ళ దగ్గరా మాటాడినట్టు నా దగ్గర మాటాడొద్దు. నే నావులిస్తే ప్రేవులు లెక్కెంచే వాణ్ణి. నువ్వు కేశవులవి! నాకు తెలుసు, మీ అమ్మకు తెలుసు. ఇంకా వూళ్ళో చాలా మందికి తెలుసు. ఆ రంగయ్యగాడికి తెలియకపోతే తెలిసి వచ్చేట్టుచేసే భారం నాది. నే నన్యాయాన్ని చూచి సహించే వాణ్ణిగాను. ఆరు నూర యినా, నూరు ఆరయినా నువ్వీ వూరు వదలడానికి వీల్లేదు. నేను మనిషి ముఖం చూచేవాణ్ణి. డబ్బు ముఖం చూచేవాణ్ణిగాను, నీ అబ్బగంటులో నీ కెందుకు భాగం రాకపోతుందో చూస్తాను. అవసరమైతే హైకోర్టు దాకా వెళ్తాను" అన్నారు రంగనాథంగారు.

"బాబ్బాబూ!" అని గింజుకోబోయాడు బైరాగి.

"బాబూ లేదు, గీబూ లేదు! ఈ రోజునుంచీ ఈ కేసు సెటిలయ్యే దాకా నీకు ప్రతిరోజూ శేరు బియ్యం, ప్రతి వారమూ అయిదు రూపాయల రొఖ్ఖం. ఇంకేం మాటాడొద్దు, వెళ్ళు" అన్నారు రంగనాథంగారు.

ఈ సంగతి తెలియగానే యువతలి వైపు గుడారంలో తీవ్రమైన సంచలనం బయల్దేరింది. తమ హితవును పాటించి వూరువిడిచి వెళ్ళకపోతే సున్నంలోకి ఎముక లేకుండా విరగొట్టి, తన్ని తగలేసి, డొక్క చించి డోలు కట్టించగలమని బైరాగికి సరాసరి అరగంటకొక్క అల్టిమేటమ్ రాసాగింది.

ఇదేం బెడదరా దేవుడా అంటూ తలమీద చేతులుంచుకుని విషణ్ణ వదనంతో కూచున్నాడు బైరాగి. అతడి భార్యాబిడ్డలు గుండె నిబ్బరం గోల్పోయి ఏడవనుగూడా ఏడ్చారు!

ఊళ్ళోవాళ్ళ అహ్లాదానికి మాత్రం పట్టపగ్గాలు లేకపోయింది. చెట్టు క్రింద, రచ్చపైన, గుడి దగ్గర నలుగురుగా అయిదుగురుగా ప్రోగై, వాళ్లు రాగల పరిణామాలను గురించి ఊహాగానం సలుపసాగారు.

ఒకటి—రంగయ్యగారు బైరాగి అనే కేశవులకు (?) పిత్రార్జితాన్ని పంచి పెడ్తాడా?

రెండు—అలా పంచి పెట్టకపోతే రంగనాథం రంగయ్యగారికి మూసీనది వొడ్డునవున్న హైకోర్టు భవనాల్ని చూపిస్తాడా?

మూడు—రంగయ్యగారి కుమారుల ప్రతాపాగ్ని బైరాగినీ, అతని సంసారాన్ని భస్మీపటలం చేస్తుందా?

ఈ ప్రశ్న లన్నింటికీ సదుత్తరాలను మేము కాలమనే వెండితెర పైన్నే చూచుకోవలసి వచ్చింది!

*　　*　　*

నేను కొట్టినట్టే కొడ్తాను, నువ్వేడ్చినట్టే ఏడువు అన్నట్లుగా వానలు వర్ష ఋతువు పొడుగునా కురిసినా చెరువులు మాత్రం నిండాయి కావు. మా వూరిచెరువుకు నెలరోజులకు నీళ్ళొచ్చాయి.తూము జారీగా వదలిపెడ్తే ఈనెల రోజుల నీళ్ళనూ నోరున్నవాళ్ళు వారం రోజులోనే వినియోగించుకునే ప్రమాదముంది. అందుచేత ఆయకట్టునుబట్టి జాములేర్పాటు చేశారు. ఓరోజు రాత్రి మూడో జామున పొట్టగర్రబోతున్న మా రాగిపైరుకు జాము వచ్చింది, లాంతరు పట్టుకుని అర్ధరాత్రప్పుడు చెరువు క్రిందికి వెళ్ళి, తీరా మడి పారే

దాకా వుండమని పాలేరుకుచెప్పి నేను యింటికి తిరిగి వస్తున్నాను. ఊరి పొలిమేరదగ్గర అడ్డు దారిలో చీమ చిటుక్కుమంటే అదిరిపడుతూ దొంగల్లా మెల్లగా జారుకుంటున్న బైరాగి కుటుంబం నాకు హఠాత్తుగా ఎదురైంది.

"ఇదేమిటీ బైరాగీ! కథను సగంలో వదిలిపెట్టి నువ్విలా వెళ్ళి పోతున్నావు?" అంటూ విస్తుపోయాను.

"బాబ్బాబూ! తమకు పున్నెముంటుంది. చచ్చి మీ కడుపునబుట్టాను. ఊళ్ళో గనుక పొరవిడిచారంటే వాళ్ళొచ్చి మమ్మల్ని వెనక్కి లాక్కెళ్తారు" అన్నాడు బేజారెత్తిపోతూ బైరాగి.

"అబ్బే, నేనెందుకు చెబుతాను బైరాగీ! నువ్వు నిశ్చింతగా వెళ్ళిపో. కానీ త్వరగా వెళ్ళాలి" అన్నాను.

అన్నానేగానీ అంత చప్పగా అతనికి వీడ్కోలివ్వడానికి మనస్కరించింది గాదు. మళ్ళీ అతణ్ణి పిలిచాను.

"ఏమిటి బాబూ?" అంటూ అతడు దగ్గరికొచ్చాడు.

"నువ్వు కేశవులివి అవునో కాదో అన్న సందేహం మాత్రం అలాగే వుండిపోయింది. ఈ ఒక్క విషయం మాత్రం చెప్పి పోవూ!" అని ప్రాధేయపడ్డాను.

బైరాగి ఒకటి రెండు క్షణాలు ఆలోచించి "నేను నిజంగా కేశవులినే అయితే రంగయ్యగారు నా కాస్తిలో వాటా యివ్వగలరంటారా బాబూ?" అన్నాడు.

"సందేహమే" నన్నాను.

"పోనివ్వండి. ఆయన వాటా పంచి పెట్టారే అనుకోండి. ఆ రంగనాథంగారు నా కూతుర్ని తన కొడుక్కు కట్టబెట్టుకోగలరంటారా బాబూ?"

"అదీ సందేహమే" నన్నాను.

"ఐతే, యిదీ సందేహంగానే వుండపోనివ్వండి బాబూ! పోయిందే ముంది?" అంటూ బైరాగి ముందుకు దారితీశాడు,

నే నావైపు చూస్తూ అలాగే విగ్రహంలా నిల్చుండిపోయాను. *

When the identity of a man does not benefit him in the least, only helps to aggravate village rivalries.